ప్రజాశక్తి
గురువారం 2 నవంబర్ 2023 5
అనంతపురం

జెఎన్‌టియు ఎంటెక్ ఎం.ఫార్మసీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబర్, అక్టోబర్ నెల్లో నిర్వహించిన ఎంటెక్ సెకండ్ సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, ఎంటెక్ థర్డ్ సెమిస్టర్ (ఆర్-21), (ఆర్-17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంటెక్ ఫస్ట్ సెమిస్టర్ (ఆర్-21), (ఆర్-17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎం.టెక్ సెకండ్ సెమిస్టర్ (ఆర్-17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎం.ఫార్మసీ సెకండ్ సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, ఎం.ఫార్మసీ థర్డ్ సెమిస్టర్ (ఆర్-21), (ఆర్-17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎం.ఫార్మసీ సెకండ్ సెమిస్టర్ (ఆర్-17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎం.ఫార్మసీ ఫస్ట్ సెమిస్టర్ (ఆర్-21), (ఆర్-17) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ ఆచార్య బి.చంద్రమోహన్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం JNTUA వెబ్ సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని తెలిపారు.

కల్లూరులో అధికారులు కూల్చివేసిన పేదల నివాసాలు

ఇంటిని కూల్చేయడంతో రోదిస్తున్న వృద్ధురాలు

పేదలపై.. 'అధికార' కర్కశత్వం

- కల్లూరులో పేదల ఇళ్లు కూల్చివేత
- రెవెన్యూ, పోలీసు అధికారుల దుశ్చర్య
- అడ్డుకున్న సిపిఎం నాయకులపై లాఠీఛార్జీ
- బలవంతపు అరెస్టులు..
- సిఐ ఓవరాక్షన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెల తొలగింపు కార్యక్రమాలను అధికారులు యథేచ్ఛగా చేస్తున్నారు. ఒక ప్రాంతం ఘటన మరువక ముందే మరొక ప్రాంతంలో జెసిబిలతో గుడిసెలను తొలగిస్తూ వారి కర్కశత్వాన్ని చాటుకుంటున్నారు. తాజాగా అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో పేదలు వేసుకున్న ఇళ్లు, గుడిసెలను రెవెన్యూ, పోలీసు అధికారులు బుధవారం వేకువజామున జెసిబిలో తొలగించేశారు. దీనిని అడ్డుకున్న సిపిఎం నాయకులపైనా పోలీసులు లాఠీఛార్జి చేసి, బలవంతంగా అరెస్టులు చేశారు. గుడిసెలు కూల్చొద్దంటూ పేదలు ప్రాధేయపడినా కనికరం లేకుండా అధికారులు వాటిని కూల్చివేశారు. దీంతో పేదలు కన్నీరుమున్నీరుగా విలపించారు. కట్టుబట్టలతో నిలువనీడ కోల్పోయి పేదలు రోడ్డునపడ్డారు.

ప్రజాశక్తి-గార్లదిన్నె, అనంతపురం కలెక్టరేట్

గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామ పంచాయతీ సర్వేనెంబర్ 165లో గల ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. గత 30 సంవత్సరాలుగా ఇళ్లు లేని నిరుపేదలు దాదాపు 200 కుటుంబాలు నాలుగేళ్ల క్రితం ఇక్కడ గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. అక్కడే తమకు నివాస స్థల పట్టాలు ఇవ్వాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. అయినా ఎవరూ స్పందించలేదు. ఈ భూమి దేవాదాయ శాఖకు చెందినదని దానిని ఖాళీ చేయాలంటూ పలుమార్లు అధికారులు బెదిరింపులకు దిగారు. దీంతో పేదలు న్యాయం కోరుతూ కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన విచారణ కోర్టులో జరుగుతోంది. ఈ విచారణ జరుగుతుండగానే పోలీసులు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే బుధవారం వేకువజామున పెద్ద సంఖ్యలో ప్రభుత్వ అధికారులు, ప్రయివేటు వ్యక్తులు జెసిబిలను తీసుకుని వచ్చి గుడిసెల కూల్చివేతకు సిద్ధపడ్డారు. ఏమి జరుగుతుందో తెలియక పేదలు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. గుడిసెల్లో నిత్యావసర వస్తువులు, ఇతర సామగ్రి ఉన్నాయని, తొలగించొద్దంటూ ప్రాదేయపడినా వినకుండా ఇష్టం వచ్చినట్లు కూల్చిపడేశారు.

అడ్డుకున్న సిపిఎం.. పోలీసుల లాఠీఛార్జి.. నాయకుల అరెస్టు

కల్లూరు గ్రామంలో పేదల గుడిసెలు తొలగిస్తున్న విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ గార్లదిన్నె మండల కార్యదర్శి చెన్నారెడ్డి, రైతుసంఘం నాయకులు నాగరాజుతో కలిసి ఆ ప్రాంతానికి హుటాహుటిన వెళ్లారు. గుడిసెల తొలిగింపును అడ్డుకునే ప్రయత్నం చేశారు. పేదల గుడిసెలు ఎలా తొలగిస్తారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే అక్కడ సిబ్బందితో కలిసి ఉన్న ఇటుకలపల్లి సిఐ నరేందర్‌రెడ్డి సిపిఎం నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరుషపదజాలంతో దూషించారు. లాఠీఛార్జి సైతం చేశారు. అక్కడ ఉండేందుకు వీల్లేదంటూ రాంభూపాల్‌తో పలువురు సిపిఎం నాయకులను బలవంతంగా అరెస్టు చేసి బుక్కరాయసముద్రం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

నివాసాలు కోల్పోయిన పేదలకు న్యాయం చేసి, అనుచితంగా ప్రవర్తించిన ఇటుకలపల్లి సిఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అనంత ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

పేదల కన్నీటి రోదన

ఒక్కసారిగా అధికారులు గుడిసెలు తొలగించడంతో పేదలు కకావికలం అయ్యారు. 'సారూ మా గుడిసెలు తొలగించొద్దంటూ రెవెన్యూ, పోలీసు అధికారులను ప్రాధేయపడ్డారు. అయినా కనికరం చూపని అధికారులు గుడిసెలను కూల్చివేశారు. కష్టపడి నిర్మించుకున్న గుడిసెలను కళ్లేదుటే కూల్చివేయడాన్ని చూసి పేదలు గుండెలు అవిసేలా రోదించారు. నిత్యావసర వస్తువులు, సామగ్రి ధ్వంసం అయ్యింది. కట్టుబట్టలతో 200 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అప్పడే పుట్టిన పసికందును సైతం చేతుల్లో ఎత్తుకుని బాలింతలు రోడ్డుపైకి రావాల్సిన పరిస్థితి దయనీయ పరిస్థితి నెలకొంది.

పై ఫొటోలో కన్పిస్తున్న ఇద్దరు మహిళలు ప్రస్తుతం అధికారులు కూల్చివేసిన ప్రాంతంలో నివసిస్తున్న వారు. వీరిలో ఒకరు నిండు గర్భిణి కాగా, మరొకరు 20 రోజుల బాలింత. ఇలాంటి వారున్న ఈ ప్రాంతంలో అధికారులు ఎంత దయనీయంగా, నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారనడానికి ఈ మహిళలే నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తున్నారు. 'సార్.. మా గుడిసెలు కూల్చి మమ్మల్ని రోడ్డున పడేయొద్దంటూ' వేడుకున్నా అధికారులు కనికరించకుండా ఎంత క్రూరంగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చు.

తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాల వద్ద ధర్నా

పేదల ఇళ్ల, గుడిసెల తొలగింపు, సిపిఎం నాయకులపై సిఐ అనుచిత ప్రవర్తనను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. గార్లదిన్నె తహశీల్దార్ కార్యాలయం, అనంతపురం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళనలు కొనసాగించారు. అనంతపురం ఆర్డీవో కార్యాలయం వద్ద అధికారులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్డీవోను కార్యాలయం లోపలికి వెళ్లనీయకుండా ఘెరావ్ చేశారు. కొద్దిసేపటి తరువాత ఆర్డీవో సిపిఎం నాయకులతో చర్చలు జరిపారు. పేదలకు యథాస్థానంలో పట్టాలు ఇవ్వాలని, పేదలు, సిపిఎం నాయకులపై అనుచితంగా ప్రవర్తించిన సిఐ నరేందర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ పేదలకు న్యాయం చేసేలా తాను చర్యలు తీసుకుంటానని చెప్పి ఆందోళన విరమింపజేశారు.

పేదల ఇళ్ల కూల్చివేతలో ఎమ్మెల్యే హస్తం

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఎ.గపూర్

కల్లూరు గ్రామంలో పేదల గుడిసెలు, ఇళ్ల తొలగింపులో స్థానిక ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హస్తం ఉందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఎం.గఫూర్ తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారులు కూల్చివేసిన ఇళ్లను బుధవారం సాయంత్రం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.ఓబులు తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులతో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఓ వైపు ప్రతి నిరుపేదకూ ఇల్లు ఇస్తామని చెబుతూ ఆచరణలో మాత్రం పేదలు కట్టుకున్న ఇళ్లను జెసిబిలతో కూల్చివేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకింత కక్షో అర్థం కావడం లేదన్నారు. పేదలకు ప్రత్యామ్నాయ స్థలం చూపేంత వరకు నివాసాలను తొలగించరాదని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ కల్లూరులో యథేచ్ఛగా అధికారులు కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారన్నారు. నిజంగా ప్రభుత్వానికి దేవాదాయ శాఖ భూములు కాపాడాలనే ఉద్దేశంతో ఉంటే ప్రస్తుతం పేదల ఇళ్లు కూల్చివేసిన స్థలానికి ఆనుకుని వైసీపీ నాయకుడు ఆక్రమించుకున్న 90 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అధికారులు వైసిపి నాయకులకు ఒక న్యాయం, పేదలకు ఒక న్యాయం అమలు చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. పేదల ఇళ్లు కూల్చివేతపై పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ప్రస్తుతం కూల్చివేతకు సంబంధించి ప్రతి ఒక్క పేద కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో పేదల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు.

ఎమ్మెల్యే బాధ్యత వహించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

గార్లదిన్నె మండలం, కల్లూరు గ్రామంలో పేదలు వేసుకున్న గుడిసెలను పోలీసులు వైఎస్‌ఆర్‌సిపి నేతల సమక్షంలోనే తొలగించారని, ఇందుకు శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బాధ్యత వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే పద్మావతి ఆదేశాలు లేనిదే గుడిసెలు కూల్చివేత జరగదన్నారు. పేదలకు జరిగిన నష్టానికి ఎమ్మెల్యే బాధ్యత వహించి వారికి పరిహారంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. పేదలు నిర్మాణం చేసుకున్న ఇళ్లను ఖాళీ చేయించాల్సి వస్తే వారికి ప్రత్యామ్నాయం స్థలాలు చూపించి, నోటీసులు ఇచ్చిన తరువాతనే ఖాళీ చేయించాలని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అవేవి పరిగణలోకి తీసుకోకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు వైసిపి నాయకుల సమక్షంలో గుడిసెలు తొలగించి ప్రజలను రోడ్ల పాలు చేశారని తెలిపారు. పోలీసులు వైసిపి కార్యకర్తలుగా వ్యవహరించడం సిగ్గుచేటుగా ఉందన్నారు. సిఐ నరేంద్ర రెడ్డి దురుసుగా వ్యవహరించి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. తక్షణం సిఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు నష్టపరిహారం అందేలా ఎమ్మెల్యే బాధ్యత తీసుకోవాలని కోరారు. పేదలకు న్యాయం జరిగేంత వరకు వారి పక్షాన సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని రాంభూపాల్ తెలియజేశారు.

తాడిపత్రిలో ప్రజారక్షణభేరియాత్రకు స్వాగతం పలుకుతున్న సిపిఎం నాయకులు

రాష్ట్రంలో మోడీని ప్రశ్నించలేని పార్టీలు

- రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా మౌనమే..
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో ప్రజలకు నష్టం
- తాడిపత్రి, గుత్తి సిపిఎం ప్రజారక్షణభేరి యాత్రలో సిపిఎం నాయకులు
- జిల్లాకు చేరిన బస్సుయాత్రకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-తాడిపత్రి

విభజన, ఎన్నికల హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి అడుగడుగునా మోసం చేస్తున్నా ప్రధాని నరేంద్ర మోడీని ప్రశ్నించలేని స్థితిలో రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఉన్నాయన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర బుధవారం సాయంత్రం అనంతపురం జిల్లాకు చేరుకుంది. కడప జిల్లా మీదుగా జిల్లాలోకి ప్రవేశించిన యాత్ర తాడిపత్రి నుంచి గుత్తి వరకు కొనసాగింది. తాడిపత్రి, గుత్తి పట్టణాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో నాయకులు ప్రసంగించారు. బస్సుయాత్ర బందానికి స్థానిక సిపిఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కడప సరిహద్దు ప్రాంతం నుంచి మోటార్ బైక్ ర్యాలీగా స్వాగతం పలికారు. తాడిపత్రిలోని దినసరి కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ ప్రజానాట్య మండలి కళాకారులు పాటలు పాడి నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, వి.కృష్ణయ్య, ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు రమదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తాడిపత్రిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కోటి మంది స్కీమ్ వర్కర్లను విధుల నుంచి తొలగించే కుట్రకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూరుకుటోందని చెప్పారు. 33 లక్షల మంది పిల్లలకు పోషకాహారం అందించలేని పరిస్థితిలో కేంద్రం ఉండడం సిగ్గుచేటన్నారు. నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యను నీర్వర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తానని, నల్ల డబ్బును తెప్పించి పేదల అకౌంట్లో రూ.15 లక్షల వేస్తానని నమ్మించి ఓట్లు వేయించుకున్న నరేంద్ర మోడీ వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరాభారాలతో ప్రజలు సతమతం అవుతున్నా మోడీకి చీమకుట్టినట్లు అయినా లేదన్నారు. అదానీ, అంబానీలకు చిన్న ఇబ్బంది కలిగినా మోడీ తక్షణం స్పందిస్తారని, పేదవారు కష్టాల్లో ఉంటే మాత్రం కనీసం పట్టించుకునే పరిస్థితి కూడా ఆయనకు లేదని ఎద్దేవా చేశారు. విజయనగరంలో రైలు ప్రమాదం జరిగి 14మంది మరణిస్తే మోడీకి చీమకుట్టినట్లుగా కూడా లేదని విమర్శించారు. బిజెపి అధికారంలో ఉంటే దేశం అధోగతిపాలవుతుందన్నారు. కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక పాలనను సాగిస్తున్న బిజెపిని ప్రజలు అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్లుగా మహిళలు, పసిపిల్లలకు రక్షణ కల్పించ లేక విఫలం చెందిన బిజెపి ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును ఇప్పుడు తేవడం ఓట్ల కోసమే అన్నారు. మోడీ చేస్తున్న అన్యాయాన్ని రాష్ట్రంలో ఏ పార్టీ నాయకులూ ప్రశ్నించలేని స్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోడీ అడుగులకు మడుగులొత్తుతూ ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. అంగన్వాడీలకు తెలంగాణ కంటే వెయ్యి రూపాయల అధికంగా జీతాలు ఇస్తామని చెప్పిన సీఎం జగన్మోహన్ రెడ్డి హామీ నిలుపుకోలేకపోయారన్నారు. ప్రజల గొంతు తడుపుకోవడానికి రోజూ నీళ్లు ఇచ్చే పరిస్థితి రాష్ట్రంలో లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. గతంలో తాడిపత్రి ప్రాంతంలో 2వేల నాపరాయి పరిశ్రమలు ఉండేవని, ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో అవి 400కు తగ్గిపోయాయన్నారు. ఇందులో పని చేస్తున్న వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి ఇతర వలస వెళు_న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా కల్లూరులో నివసిస్తున్న పేదల గుడిసెలు కూల్చుతుంటే అడ్డుకున్నందుకు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్‌పై పోలీసులు లాఠీఛార్జి చేయడం అత్యంత దుర్మార్గం అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకే సిపిఎం ఆధ్వర్యంలో బస్సుయాత్ర చేపట్టామని తెలియజేశారు. నవంబర్ 15న విజయవాడ వేదికగా భారీ బహిరంగ సభతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దష్టికి ప్రజా సమస్యలను తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ బహిరంగ సభలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఎం నాయకులు జగన్మోహన్ రెడ్డి, రాజారామ్‌రెడ్డి వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అప్పు చేసిన లక్షల కోట్లు ఎక్కడ..? : ఎంఎ.గపూర్

గుత్తి : వైసిపి ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పు చేసి సంక్షేమ పథకాలకు రూ.2.50 లక్షలు మాత్రమే బటన్ నొక్కా అందజేసింది మరి మిగతా రూ.7.50 లక్షల కోట్ల సొమ్ము ఎక్కడికెళ్లిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే గపూర్ ప్రశ్నించారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణభేరి రాష్ట్ర బస్సు యాత్ర బుధవారం రాత్రి గుత్తికి చేరుకుంది. ముందుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గపూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ గాంధీ సర్కిల్ నుంచి గాంధీ కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. కళాకారుల బందం పాటలు పాడి అలరించారు. అనంతరం గాంధీ చౌక్ వద్ద ఏర్పాటైన బహిరంగ సభలో గపూర్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వైసిపి ప్రభుత్వం వత్తాసు పలుకుతోందన్నారు. ఎపి రాష్ట్ర విభజనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలను విభజిస్తూ పాలిస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీల అప్పగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ అభివద్ధి కోసం పోరాడాల్సింది పోయి మోడీ ప్రభుత్వానికి వైఎస్.జగన్ భజన చేస్తున్నారని చెప్పారు. కరువు ప్రాంతాల్లో రైతన్నలను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు ప్రభుత్వ, పేదల భూములను ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లూరులో ఎమ్మెల్యే ఆదేశాలతోనే పేదల గుడిసెలను అర్ధరాత్రి సమయంలో తొలగించారని చెప్పారు.

గుత్తి బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ఎంఎం.గపూర్

గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అమరావతి మీద దృష్టి పెట్టి పాలన గాలికి వదిలేసారని చెప్పారు. టిడిపి ప్రభుత్వం మీద మేము వ్యతిరేకంగా పోరాడమని ఆయన గుర్తు చేశారు. ఈనెల 15వ తేదీన విజయవాడలో చేపట్టిన భారీ బహిరంగ సభకు రైతులు, కూలీలు, కార్మికులు, ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, నాయకులు కసాపురం రమేష్, వి.నిర్మల, సాకె నాగరాజు, మారుతి, అవాజ్ కమిటీ నాయకులు షాషావలి, సిపిఎం మండల కార్యదర్శి బి.రామకష్ణ, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, కేవీపీఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, సిఐటియు మండల అధ్యక్షుడు ఎం.మల్లేష్, కవిత, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో ర్యాలీగా వస్తున్న సిపిఎం నాయకులు

బస్సుయాత్రలో గేయాలు ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

జాతీయ జెండాను ఎగురవేస్తున్న కలెక్టర్ గౌతమి

చిరస్మరణీయులు పొట్టి శ్రీరాములు : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు అని కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కలెక్టరేట్‌లో బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాలాపన చేశారు. అనంతపురం ఏఆర్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ కె.హరికష్ణ ఆధ్వర్యంలోని సాయుధదళం నుంచి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. రెవెన్యూ భవనంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, దేవాదాయ శాఖ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్, ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చి ప్రాణాలను అర్పించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ గత పాలకులు అవతరణ దినోత్సవాన్ని విస్మరించారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగనన్న పొట్టి శ్రీరాములు త్యాగాలను స్మరించుకుంటూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుగుతున్నారన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

కరువు ఎక్కువ.. మండలాలు తక్కువ..!

అధికారిక ప్రకటనపై విపక్షాల పెదవివిరుపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కరువు మండలాల ప్రకటనపై విపక్షాలు పెదవి విరుస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఈ ఏడాది ప్రారంభం నుంచే నెలకొన్నాయి. మొత్తం 63 మండలాలుంటే 11 మండలాల్లో సాధారణ వర్షపాతం కనిపిస్తోంది. తక్కిన అన్ని మండలాల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇటువంటి సమయంలో అన్ని మండలాలను కరువు మండలాలు ప్రకటించాలని విపక్షాలు డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం 35 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించింది. అనంతపురం జిల్లాలో 28 మండలాలు, సత్యసాయి జిల్లాలో ఏడు మండలాలు కరువు మండలాలుగా ప్రకటించింది. సత్యసాయి జిల్లలో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్న లేపాక్షి, రొద్దం మండలాలను సైతం కరువు మండలాలుగా ప్రకటించకపోవడం గమనార్హం. రొద్దం మండలంలో ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే 70 శాతం లోటుంది. ఇక లేపాక్షి మండలంలో 64.1 శాతం వర్షపాతం లోటుంది. ఈ మండలాలకు కరువు మండలాల జాబితాలో చోటు దక్కలేదు. తక్కిన మండలాల్లోనూ సాధారణం కంటే 35 శాతం కంటే అధికంగానే వర్షపాతం లోటుంది. అయినా ప్రభుత్వం ఈ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అనంతపురం జిల్లా కరువు మండలాలు

డీ.హీరేహాల్, రాయదుర్గం, కణేకల్, విడపనకల్లు, గుంతకల్లు, గుత్తి, పెద్దవడుగూరు, యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు, పామిడి, వజ్రకరూరు, ఉరవకొండ, గుమ్మగట్ట, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, కూడేరు, గార్లదిన్నె, శింగనమల, పుట్లూరు, నార్పల, బుక్కరాయసముద్రం, అనంతపురం, రాప్తాడు, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు.

సత్యసాయి జిల్లాలో కరువు మండలాలు

నంబులపూలకుంట, మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి, పరిగి.



అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం 421.9 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 253.8 మిల్లీమీటర్లు మాత్రేమ నమోదయింది. సాధారణం కంటే 39.8 శాతం తక్కువ వర్షపాతం ఈ ఏడాది నమోద య్యింది. సత్యసాయి జిల్లాలో 478.8 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతానికి గానూ 299.2 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయ్యింది. 37.4 శాతం ఈ ఏడాది వర్షపాతం లోటుంది. రెండు జిల్లాల పరిధిలోనూ అటు ఆరు మండలాలు, ఇటు ఐదు మండలాల్లో మినహా తక్కిన అన్ని మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఖరీఫ్ పంటలు ఇప్పటికే పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో ఈ ఏడాది రబీ ఆశలు కూడా సీజన్ ప్రారంభంలోనే ఆవిరవుతున్నాయి. పరిస్థితి ఇంత దయనీయంగా ఉన్నా ప్రభుత్వం కరువు మండలాను తక్కువగా ప్రకటించడం పట్ల సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి.

అధికార పార్టీకి సిఐ ఊడిగం

పేదల గుడిసెల తొలగింపుపై సిపిఎం నిరసన

బుక్కరాయసముద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

కోర్టు ఆదేశాలను ధిక్కరించి పేదల గుడిసెలు తొలగింపునకు పాల్పడిన ఇటుకలపల్లి సిఐ నరేంద్రరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం బుక్కరాయసముద్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ గార్లదిన్నె మండలంలోని కల్లూరు గ్రామంలో నాలుగేళ్ల క్రితం పేదలు వేసుకున్న గుడిసెలపై అధికార పార్టీ నాయకులు, అధికారులు, పోలీసులు దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. గుడిసెలు, ఇళ్లు తొలగించవద్దని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ జెసిబిలతో గుడిసెలు తొలగించడం దుర్మార్గమన్నారు. పేదలకు అండగా నిలిచిన సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్‌ను సిఐ చెయ్యి పట్టుకోవడం చూస్తే అధికార పార్టీకి ఊడిగం చేస్తున్నట్లుందన్నారు. గార్లదిన్నె మండలంలో వైసిపి కబ్జాలు, భూ అక్రమాలను నిలదీసిన సిపిఎం వైఖరిని జీర్ణించుకోలేని అధికార పార్టీ నాయకులు పోలీసులతో పేదల గుడిసెలు, ఇళ్లను కూల్చి వేశారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే సిఐపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, పేదలకు అక్కడే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. రాస్తారోకోలో రైతు సంఘం జిల్లా నాయకులు వి.శివారెడ్డి, డి.శ్రీనివాసులు, సిపిఎం నాయకులు వెన్నారెడ్డి, ఇల్లూరు నల్లప్ప, సంజీవరెడ్డి, నాగేంద్ర, నెట్టికంటయ్య, చెన్నప్ప, వెంకట కొండన్న, పరిక్షిత్తు, చిన్న గంగయ్య, వన్నూరప్ప పాల్గొన్నారు.

గుంతకల్లులో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

గుంతకల్లు : గార్లదిన్నె మండల పరిధిలోని కల్లూరులో పేదల గుడిసెల తొలగింపు దుర్మార్గమని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మండిపడ్డారు. గుడిసెల తొలగింపు, సిపిఎం నాయకుల అక్రమ అరెస్టును ఖండిస్తూ బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ పేదల భూమి అంశం కోర్టు పరిధిలో ఉండగా పోలీసులు, రెవెన్యూ అధికారులు జెసిబిలను తీసుకెళ్లి వాటిని కూల్చివేయడం అమానుషమన్నారు. గుడిసెల తొలగింపును అడ్డుకునేందుకు ప్రయత్నించిన సిపిఎం నాయకులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, జగ్గిలి రమేష్, రంగప్ప, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, చంద్ర, ఓబులేసు, అబ్బుల్ల, వెంకీ, చెర్రీ, షాషా, సూరి పాల్గొన్నారు.

ఆత్మకూరు : గార్లదిన్నె మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో నాలుగేళ్ల క్రితం పేదలు వేసుకున్న గుడిసెలను పోలీసులు కూల్చి వేయడాన్ని ఖండిస్తూ బుధవారం ఆత్మకూరులో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మండల కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ పేదలను కులం పేరుతో దూషించి, దౌర్జన్యం చేసిన ఇటుకలపల్లి సిఐ వై.నరేంద్రరెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి రామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సోమశేఖర్ రైతు సంఘం మండల కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : కల్లూరులో నిరుపేదల గుడిసెలను ఎమ్మెల్యే అనుచరులు దౌర్జన్యంగా జెసిబితో తొలగించడం దారుణమని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. అడ్డుకోబోయిన సిపిఎం నాయకులను పోలీసులు దౌర్జన్యం గా అరెస్టు చేయ డం దారుణమన్నారు. అరెస్టులతో ఉద్యమాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, సహాయ కార్యదర్శి జి.వెంకటచౌదరి, నాయకులు టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి. కె.నాగభూషణ్, ఎల్లనూరు మండలం నాయకులు ఓబులేసు, రమేష్, సూరి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : కల్లూరులో పేదల గుడిసెల తొలగింపును నిరసనగా మండల పరిధిలోని క్రిష్టిపాడు గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మద్దిలేటి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కృష్ణనారాయణ, చేనేత సంఘం నాయకులు పెద్దయ్య, రంగస్వామి, ఆదినారాయణ, శివప్రసాద్, రైతు సంఘం నాయకులు రంగస్వామి, పెద్దయ్య, నాగరాజు, ఆవాజ్ మండల అధ్యక్షులు రఫీ, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగ ఫలితమే ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని నగర మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. ఎపి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం కోసం కృషి చేసిన మహనీయుల త్యాగాలు, స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. ఐదేళ్ల పాటు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఆగిపోగా వైసిపి అధికారంలోకి రాగానే రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. సిఎం జగన్ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ మహనీయుల అడుగు జాడల్లో నడుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఇఇలు సూర్యనారాయణ, సుధారాణి, డిఇలు సుభాష్, రవీంద్రారెడ్డి, ద్రాక్షాయణి, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్

అనంతపురం : నగరంలోని జెఎన్‌టియు పరిపాలనా భవనంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహిచారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లి చిత్ర పటాలకు ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన, రెక్టార్ ఆచార్య ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, వర్సిటీ ఉన్నతాధికారు లు, సిబ్బంది పూలమాలలు వేశారు. ఉపకులపతి మాట్లాడుతూ అనేక మంది త్యాగాలతోనే ఆంధ్ర రాష్ట్ర అవతరణ జరిగిందన్నారు. పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. భారతావనికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏర్పడిన మొట్టమెదటి భాషా ప్రయుక్త రాష్ట్రం ఆంధ్ర అన్నారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఇ.అరుణకాంతి, సిబ్బంది ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లి చిత్రపటాలకు పూలమాల లు వేశారు. అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన కళాశాలలో డైరెక్టర్ ఒటిపిఆర్ఐ ఆచార్య బి.దుర్గా ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ సి.గోపీనాథ్, సిబ్బంది ఆధ్వర్యంలో చిత్ర పటాలకు పూలమాలలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో డైరెక్టర్లు ఆచార్య వి.సుమలత, ఆచార్య బి.ఈశ్వర్‌రెడ్డి, ఆచార్య జివి.సుబ్బారెడ్డి, ఆచార్య పి.సుజాత, ఆచార్య విబి.చిత్ర, ఆచార్య సి.శోభాబిందు, ఆచార్య ఎ.సురేష్‌బాబు, ఆచార్య బి.చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ కెఎఫ్.భారతి, డాక్టర్ జె.శ్రీనివాసులు, డాక్టర్ ఎం.అంకారావు, డాక్టర్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎఆర్‌లు, బోధన, బోధనేతర సిబ్బంది, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవంలో పాల్గొన్న ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన, తదితరులు

బ్రహ్మసముద్రం : అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని హెచ్ఎం అశోక్‌కుమార్ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి, ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం కార్యక్రమాలను బుధవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులకు పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై వక్తృత పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, గీతావాణి, రామాంజనేయులు, హేమావతి, చంద్రశేఖర్, సుధాబాయ్, చిన్న వన్నప్ప, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐ ప్రవీణ్‌కుమార్‌ని కలిసిన వైసిపి నాయకులు

సిఐని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ రూరల్ సిఐగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌ను బుధవారం విడపనకల్లు మండల ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశా రు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని కోరారు. సిఐని కలిసిన వారిలో వైసిపి మండల ఉపాధ్యక్షులు డోనేకల్ రమేష్, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గిరిబాబు, సర్పంచి దేవరాజు, నాయకులు డొనేకల్ శివప్ప, షేక్షా, గురుస్వామి, కరకముక్కల రామన్న, పి.వీరన్న, కమరసేడు శివన్నగౌడ్, కురుబ గోవిందు, భీమ, తదితరులు ఉన్నారు.

మాతా శిశు మరణాల నివారణపై సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. ఈబి.దేవి ఆధ్వర్యంలో హెచ్ఐఎంఎస్ నోడల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో మాతాశిశు మరణాల నివారణ, హైరిస్క్ గర్భిణుల నమోదు, సేవలు, పోషకాహారంపై అవగాహన, ఆసుపత్రిలో ప్రసవాల శాతం పెంపు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి తగిన సూచనలు ఇచ్చారు. సమావేశంలో మారుతిప్రసాద్, గణాంక అధికారి గోవిందగౌడ్, ఉప గణాంక అధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, యుపిహెచ్‌సి, హెచ్ఎంఐఎస్ నోడల్ ఆఫీసర్లు, మలేరియా, టిబి సిబ్బంది పాల్గొన్నారు.

సిఎంఆర్ పాఠశాల మూత

పెద్దవడుగూరు : మండల పరిధిలోని మిడుతూరు గ్రామంలో నిర్వహిస్తున్న సిఎంఆర్ అప్పర్ ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను 2023 జూన్ నుంచి నిర్వహించడం లేదని కరస్పాండెంట్ సి.రామాంజులరెడ్డి తెలిపారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను ఎంఇఒ రాముడుకి అందజేశామని, పాఠశాల మూసివేశామని ఆయన తెలిపారు.

చంద్రబాబుకు వచ్చింది మధ్యంతర బెయిలే..! : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం

ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా టిడిపి అధినేత చంద్రబాబుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మాత్రమే ఇచ్చిందని అయితే టిడిపి నేతలు 'నిజం గెలిచింది' అంటూ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వైసిపి కార్యాలయం వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఏ ఖైదీకైనా అనారోగ్య కారణాలు ఉంటే న్యాయస్థానాలు బెయిల్ ఇస్తాయని, చంద్రబాబు విషయంలో కూడా అదే జరిగిందన్నారు. కంటి ఆపరేషన్ కోసం షరతులతో కూడిన బెయిల్ 4 వారాల పాటు మంజూరు చేసిందని గుర్తు చేశారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు పిఎ శ్రీనివాస్ కీలకంగా ఉన్నారని, అయితే ఆయన్ను విదేశాలకు పంపించి విచారణకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపారు. మధ్యంతర బెయిల్ విషయంలోనూ రాజకీయం చేయడం సిగ్గుచేటు అన్నారు. బెయిల్ గడువు ముగిశాక మళ్లీ చంద్రబాబు జైలుకు వెళ్తారని స్పష్టం చేశారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత

రాష్ట్ర వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌తో భీమరెడ్డి భేటీ

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు వైసిపి యువనేత వై.భీమరెడ్డి బుధవారం రాష్ట్ర వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పివిఆర్ఎ.రెడ్డిని విజయవాడలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతపురం జిల్లాలోని ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో వేలాది మంది రైతులు 2019 నుంచి 'వాటర్ షెడ్ ఫారం ఫండ్స్' కింద తమ పొలాల్లో పనులు చేసుకున్నారని, ఆ పనులకు సంబంధించి వెంటనే నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని భీమరెడ్డి కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అలాగే ఉరవకొండ నియోజకవర్గంలోని ఉరవకొండ, విడపనకల్లు మండలాలకు సంబంధించిన వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ కార్యాలయాన్ని కళ్యాణదుర్గంకు తరలించడం పట్ల భీమరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉరవకొండ పట్టణంలోనే ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకొని క్లస్టర్ కార్యాలయం ఉరవకొండలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని డైరెక్టర్ తెలిపారన్నారు.

'అనంత' యువతకు కేంద్ర మంత్రి అభినందనలు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాకు చెందిన యువత బుధవారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన మేరీ మట్టి మేరా దేశ్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్లు ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత బిసాతి భరత్, సుంకర రమేష్ రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్ కుమార్, కె.జయమారుతి పాల్గొన్నారు. వారు నెహ్రూ యువ కేంద్ర అనంతపురం అనుబంధ సంస్థలైన ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సామాజిక సేవలను మంత్రికి వివరించారు. అలాగే ఉమ్మడి అనంతపురం జిల్లాలో మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో సేకరించిన మట్టి కలశాల నిర్వహణపై జిల్లా అధికారులు, స్వచ్ఛంధ సంస్థల పనితీరును వివరించారు. మంత్రి మాట్లాడుతూ యువత దేశ అభివృద్ధికి తోడ్పడాలని, మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు వై.పవన్, తుకారాం నాయక్, జి.నందిత, కీర్తి, గణేశ్, సంతోష్‌నాయక్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అనురాగ్‌సింగ్‌ఠాకూర్‌తో అనంత యువత

వరికి తెగులు.. అన్నదాత కుదేలు

తెగులు సోకిన వరి పంటను చూపుతున్న రైతు సంఘం జిల్లా నాయకులు జ్ఞానమూర్తి

ప్రజాశక్తి-ఉరవకొండ

లక్షలాది రూపాయలు అప్పు చేసి పెట్టుబడులు పెట్టి వరి పంట సాగు చేయగా పంట చేతికొచ్చే సమయంలో తెగులు సోకడంతో రైతులు కుదేలయ్యారు. మండల పరిధిలోని మోపిడి, ఇంద్రావతి గ్రామాల్లో రైతులు బోర్లు, కాలువల కింద దాదాపు 800 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. పంట సాగు చేసి రెండు నెలలు దాటిందని, పంట చేతికొచ్చే సమయంలో చిలుకలు వాలడంతో పంట పూర్తిగా ఎరుపు రంగులోకి మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మోపిడి గ్రామానికి చెందిన రైతు సంఘం జిల్లా నాయకులు జ్ఞానమూర్తి తన నాలుగెకరాల పొలంలో వరి పంట సాగు చేశారు. పొలం దమ్ము చేసేందుకు రూ. 7వేలు, నాటడానికి రూ. 6వేలు, ఇప్పటివరకూ మూడు సార్లు ఎరువులు చల్లడానికి రూ. 30వేలు, నీళ్ల మందు కొట్టడానికి రూ. 2వేల చొప్పున పంట పూర్తయేసరికి ఎకరాకు మొత్తం రూ. 70వేల వరకూ ఖర్చవుతుందని వాపోతున్నారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో పైరుపై చిలుకలు వాలి, ఆ తర్వాత వారం, పది రోజులలో పంట మొత్తం ఎరుపు రంగులోకి మారి పూర్తిగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువు దుకాణాల నిర్వాహకుల సలహా మేరకు వివిధ రకాల మందులు పిచికారి చేసిని ప్రయోజనం లేదన్నారు. కావున వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి వరి, మిరప, తదితర రకాల పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు మందులు సూచించడంతో పాటు గ్రామాల్లో రైతు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని జ్ఞానమూర్తి కోరారు.

అప్పుల ఊబిలో కౌలు రైతులు

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోయారు. కౌలు రైతులు ముందస్తు గుత్త చెల్లించి, వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేయగా తెగులు సోకడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వ్యవసాయ అధికా రులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పొలాలకు వెళ్లి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలి.

- రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

గవర్నర్ నజీర్, సిఎం జగన్‌తో సాంబశివారెడ్డి

వైఎస్ఆర్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

విజయవాడలో బుధవారం నిర్వహించిన వైఎస్ఆర్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ప్రభుత్వం మూడేళ్లుగా వైఎస్ఆర్ అఛీవ్‌మెంట్ అవార్డులు అందజేస్తోంది. ఈ తరుణంలో విజయవాడలో నిర్వహించిన ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాజరై 27 మంది ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

3 నుంచి రైళ్లు నిలిపివేత

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం-ఓబుళాపురం స్టేషన్ల మధ్య రైలు మార్గం మరమ్మతుల నేపథ్యంలో నవంబర్ 3 నుంచి నెలాఖరు వరకూ చిక్కజాజూరు -గుంతకల్లు, తిరుపతి-కదిరిదేవరపల్లి రైలు సర్వీసులను నిలిపివేస్తున్నట్లు బుధశారం రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ప్రయాణి కులు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలని వారు కోరారు.

కళాశాలలో త్రిసభ్య కమిటీ విచారణ

గుత్తి : పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం త్రిసభ్య కమిటీ సభ్యులు విచారణ చేపట్టారు. నాలుగు రోజులుగా కళాశాలలో వివాదం నెలకొంది. ప్రిన్సిపల్ సంజిత్‌నాయక్ అధ్యాపకులు, విద్యార్థినులను మానసికంగా వేధిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో త్రిసభ్య కమిటీ సభ్యులు కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులను విచారించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రుఖియా బేగం, సిఐ ఎం.వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇవ్వాలి

ఉరవకొండ : రైతులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసి ఆదుకోవాలని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు పేర్కొన్నారు. మండల పరిధిలోని గడేకల్లు గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో మిరప, పత్తి, కంది, తదితర పంటలు సాగు చేసిన రైతులు విద్యుత్ సక్రమంగా సరఫరా చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని ఎంపిపి, జడ్పిటిసిల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వారు రైతులతో కలిసి మాలాపురంలోని విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి ఎఇ సత్యంకు వినతి పత్రం ఇవ్వడంతో పాటు రైతుల సమస్యను వివరించారు. రైతులకు అనుగుణంగా తెల్లవారుజాము 3 నుంచి ఉదయం 10 గంటల వరకూ సరఫరా చేయలని కోరగా ఎఇ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు కరణం భీమిరెడ్డి, సర్పంచులు ఉమాశంకర్, దేవరాజ్, రైతులు పాల్గొన్నారు.

ఎఇ సత్యంకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సచివాలయం తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని అరకటవేముల, కడవకల్లు గ్రామ సచివాలయాలను బుధవారం ఎంపిడిఒ యోగానందరెడ్డి సందర్శించారు. ఆయన ముందుగా అటెండెన్స్, మూవ్‌మెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి లాగిన్ చేయించడం, ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు చేయించడం, పింఛన్ల పంపిణీ, తదితర కార్యక్రమాలను వాలంటీర్లు ఎలా చేస్తున్నారో పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ యోగానందరెడ్డి

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

పెద్దపప్పూరు మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశించారు. ఎస్పీ బుధవారం పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్ సందర్శించి స్టేషన్, రికార్డుల నిర్వహణ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను, రిసెప్షన్ సెంటర్, లాకప్ గదులను పరిశీలించారు. వాటర్ డిస్పెన్సరీ నుంచి వచ్చే నీటిని తాగి చెక్ చేశారు. కేసులపై సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. స్టేషన్లకు వచ్చే పిటిషనర్ల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, అనవసరంగా ఎవరినీ స్టేషన్లకు పిలిపించవద్దన్నారు. అనంతరం స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాల్లోని పరిస్థితులపై ఆరా తీశారు. శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇసుక, మట్కా, గుట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, గంజాయి, నాటుసారా తయారీ, అమ్మకం, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పని చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు.

పెద్దపప్పూరు స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

సమిష్టి కృషితోనే ఎడిసిసి బ్యాంకు అభివృద్ధి : ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి-అనంతపురం

ఎడిసిసి బ్యాంకు అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత పేర్కొ న్నారు. నగరంలోని బ్యాంకు ప్రధాన కార్యాల యం లో బుధవారం ఆమె బ్యాంకు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బ్యాంక్ సిబ్బంది సమిష్టి కృషితో బ్యాంకు అభివృద్ధి దిశలో పయనిస్తుం దన్నారు. గతేడాది డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమించిన 65 మంది సిబ్బందికి ప్రొబేషన్ డిక్లరేషన్ చేశారు. అందులో అసిస్టెంట్ మేనేజర్లు 18 మంది, స్టాఫ్ అసిస్టెంట్ 47 మంది ఉన్నారు. ఏడాదిగా వీరు అందించిన సేవలను ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరింతగా బ్యాంక్ అభివృద్ధికి దోహదపడాలన్నారు. ప్రధానంగా డిపాజిట్ల సేకరణ, రుణ వసూలు, రుణ వితరణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని బ్యాంకు అభివద్ధిలో కీలకంగా పనిచేయాల న్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సురేఖరాణి, యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు సిబ్బందితో ఛైర్‌పర్సన్ లిఖిత

బెళుగుప్పను కరువు మండలాల జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-బెళుగుప్ప

బెళుగుప్పను కరువు మండలాల జాబితాలో చేర్చాలని టిడిపి మండల కన్వీనర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు డిప్యూటీ తహశీల్దార్ పీరాసాబ్‌కు, ఎఒ పృథ్వీసాగర్‌లకు వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, ఆముదం, కంది, ఉలవ, తదితర పంటలు సాగు చేసిన రైతులు నష్టపోయారని తెలిపారు. అలాగే రబి సీజన్‌లో పప్పుశనగ సాగు చేసేందుకు సమాయ త్తం కాగా ఇప్పటివరకూ వర్షం కురవకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నార న్నారు. కావున మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు : టిడిపి

టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందిస్తామని మండల కన్వీనర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి బి. మల్లికార్జున తెలిపారు. మండల పరిధిలోని ఆవులెన్న గ్రామంలో సర్పంచి రామ్మోహన్‌చౌదరి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మేనిఫెస్టో గురించి వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పెద్ద తిప్పయ్య, త్రివేదినాయుడు, కంచ రాముడు, శివ, ఎర్రిస్వామి, వెంకటస్వామి, తిప్పేస్వామి, వన్నూరుస్వామి, బైనే నారాయణ స్వామి, అంగడి శ్రీరాములు, కార్యకర్తలు పాల్గొన్నారు

తహశీల్దార్ కార్యాలయంలో బైఠాయించిన టిడిపి నాయకులు

వ్యవసాయ కృషీవలుడు వైవి.మల్లారెడ్డికి

వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నిత్యం దుర్భిక్ష ప్రాంతాలైన రాయలసీమలో మెట్ట వ్యవసాయంలో రైతులకు మేలు చేయడం కోసం అనేక దశాబ్దాలుగా కృషి చేస్తున్న డాక్టర్ యర్రగొండ వెంకట మల్లారెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారాన్ని బుధవారం నాడు అందించింది. రాష్ట్రంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలను అందిస్తున్న వారికి ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా ఈ అవార్డులను ప్రదానం చేస్తోంది. ఈ నేపథ్యంలో 2023వ సంవత్సరంలో వ్యవసాయ రంగంలో విశేషంగా కృషి చేస్తున్నందుకు మల్లారెడ్డికి వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించింది. విజయవాడ నగరంలోని ఎ కన్వెన్షన్ హాలులో బుధవారం జరిగిన పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

నాలుగు దశబ్ధాలుగా ప్రజా సేవలోనే

శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం నీరుకుంట్లపల్లి గ్రామంలో వెంకటమ్మ, యర్రగొండ హరి నారాయణరెడ్డి దంపతులకు 1954లో వెంకట మల్లారెడ్డి జన్మించారు. 1974లో ఆర్డీటీ సంస్థలో చేరి విన్సెంట్ ఫెర్రర్ ద్వారా ప్రేరణ పొంది పేదల పురోభివృద్ధికి పాటుపడేందుకు సిద్ధమయ్యారు. అతి తక్కువ వయసులోనే ఆ సంస్థలో డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఒకవైపు సంస్థ ద్వారా పేద ప్రజలకు మెరుగైన సేవలను అందించే కార్యక్రమాల్లో పాల్గొంటూనే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో హ్యూమన్ రిసోర్సుమెంట్‌లో పిహెచ్‌డిని పూర్తి చేశారు. ఇంగ్లండ్‌లో ఎంఎబిను పూర్తి చేశారు. అమెరికాలో వర్షాభావ వ్యవసాయంపై పరిశోధనలు చేశారు. 1998లో యాక్షన్ ప్రెటర్నా అనే సంస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా వర్షాభావ ప్రాంతాల్లో మెట్ట వ్యవసాయం, ప్రత్యామ్నాయ జీవనోపాధుల కల్పనపై కృషి చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నీటి వనరుల అనుసంధానం, వ్యవసాయానికి నీటిని సమర్థవంతంగా వినియోగం ద్వారా రైతుకు ఫలసాయం అందించే దిశగా కృషి చేస్తున్నారు..

ముఖ్యమంత్రి, గవర్నర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మల్లారెడ్డి

అనేక అవార్డులు పురస్కారాలు

నాలుగు దశబ్ధాలుగా మల్లారెడ్డి చేస్తున్న సేవలకు అనేక అవార్డులు, పురస్కారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందుకున్నారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అనేక కమిటీల్లోనూ సభ్యులుగానున్నారు. రాష్ట్ర స్థాయి అగ్రికల్చర్ అడ్వయిజరీ బోర్డు సభ్యులుగానున్నారు. అంతకు మునుపు 2004లో రైతు ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జయతీ ఘోష్ కమిటీలోనూ సభ్యులుగానున్నారు.

మల్లారెడ్డి అందుకున్న అవార్డులు

1.కేంద్ర జలవనరుల విభాగం నుంచి ఉత్తమ ఎన్జీవో బహుమతి
2.ఎఫ్ఐసిసిఐ నుంచి జాతీయ స్థాయి సుస్థిర వ్యవసాయం అవార్డు
3.మహీంద్ర అండ్ మహీంద్ర నుంచి కృషి సహయోగ్ సమ్మాన్ అవార్డు
4.రైతు నేస్తం ఫౌండేషన్ నుంచి రైతు నేస్తం అవార్డు
5.శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అవార్డు
6.ఎన్జీరంగ కిసాన్ సేవా సమితి నుంచి జీవన సాఫల్య పురస్కారం.
7.రాష్ట్ర ప్రభుత్వం నుంచి జలమిత్ర అవార్డు
8.రాష్ట్ర ప్రభుత్వం నుంచే బయోడైవర్శిటీ కన్జర్వర్ అవార్డు
9.అనంత ఆణిముత్యాలు అవార్డు

సమావేశంలో మాట్లాడుతున్న సెబ్ కమిషనర్ నాగలక్ష్మి

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

సెబ్ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

డ్రగ్స్ సేవించడం వల్ల జీవితాలు నాశనం అవుతాయని, వాటికి దూరంగా ఉండాలని సెబ్ జాయింట్ కమిషనర్ టి.నాగలక్ష్మి విద్యార్థులకు సూచించారు. బుధవారం అనంతపురం పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆమె స్థానిక ఆలమూరు రోడ్డులో ఉన్న పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. తెలిసీ తెలియక విద్యార్థులు డ్రగ్స్ మత్తులో పడి వాటి నుండి బయట పడలేక శారీరకంగా, మానసికంగా దౌర్భాగ్య స్థితికి చేరి చదువును, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ అమ్మకం, రవాణా గురించి సమాచారం తెలిస్తే సెబ్ లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్ అమ్మకం దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సదస్సులో సెబ్ అధికారులు ఇన్స్‌పెక్టర్ రవిచంద్ర, కె.శ్రీనివాసులు, హసీనాబాను, కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం

ప్రజాశక్తి-నార్పల

అధికార పార్టీ అండతో కొందరు నిరుపేదల భూములు కబ్జా చేస్తున్నారని ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. గార్లదిన్నె మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో హరిజన నారాయణ భూమి కబ్జా చేసిన వారిపై నియోజకవర్గ వ్యాప్తంగా కరపత్రాలు పంచుతామని తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు నార్పలలో కరపత్రా లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల మద్దతుతో నిరుపేద కల్లూరు ఆదెన్న కుటుంబానికి న్యాయం జరిగేంత వరకూ న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిబిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు తరిమెల జైభీమ్ రామాంజనేయులు, ఏపి రైతు సంఘం నియోజకవర్గ సహాయ కార్యదర్శి మారుతి, పూల రాజు, బ్రహ్మ మంజునాథ్, దిలీప్, శేషు, కుళ్లాయప్ప, లోకేష్, కల్లూరు సాంబశివుడు, బిబిఎస్ మండల అధ్యక్షుడు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోకపోతే ఉద్యమిస్తాం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే ప్రజా తిరుగుబాటు తప్పదని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ హెచ్చరించారు. మండల పరిధిలోని నక్కనదొడ్డి, తండా, నరసాపురం, అమీన్‌పల్లి, తదితర గ్రామాల్లో సాగు చేసిన పంట పొలాలను బుధవారం ఆయన పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా రైతులు నష్టపోవడం, అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి ప్రభుత్వాలే కారణమని విమర్శించారు. కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యులు చిన్న, రామాంజనేయులు, శ్రీరాములు, నారాయణ, షేక్షావలి, రామకృష్ణనాయక్, రైతులు పాల్గొన్నారు.

ఎండిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న సిపిఐఎంఎల్ నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రపురోభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజల సంక్షేమం, రాష్ట్రం అభివృద్ధి నారా చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి తెలిపారు. బుధవారం నాడు టిడిపి ఆధ్వర్యంలో 49వ డివిజన్ ఇందిరానగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ నాయకులు, కార్యకర్తలు తిరిగి గ్యారంటీ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరుతో మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్క ఏడాదికి రూ.15 వేల, ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్ల నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ.1500, దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం, ఇంటింటికీ రక్షిత తాగునీటి కుళాయి కనెక్షన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు సాకే గంపన్న, ఆదినారాయణ, డిష్.నాగరాజు, సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, వస్నూరు, ముక్తియార్, టైలర్ శీనా, సుభాష్ చంద్రబోస్, స్వప్న, విజయశ్రీరెడ్డి, సంఘ తేజస్విని, జానకి, దలవాయి రమాదేవి, వెంకటలక్ష్మి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

విడపనకల్లు మండలం జనార్ధనపల్లిలో తెలుగుతమ్ముళ్లు సంబరాలు

తెలుగుతమ్ముళ్లు సంబరాలు

ఉరవకొండ : టిడిపి అధినేత చంద్రబాబు బెయిల్‌పై విడుదలైన సందర్భంగా బుధవారం విడపనకల్లు మండల పరిధిలోని జనార్ధనపల్లిలో టిడిపి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. గ్రామంలోని వీధుల గుండా చంద్రబాబు చిత్రపటాన్ని ఊరేగిస్తూ పెద్ద ఎత్తున టపాసులు పేల్చి స్వీట్స్ పంచిపెట్టారు. ముప్పవరపు పాండురంగ, బట్టా రామానాయుడు తలనీలాలు దేవునికి సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నాగభూషణ, మురళీ ప్రసాద్, కోనేటి లోకనాథ్, కృష్ణ, రంగనాథ్, నరసయ్య, రఘురాములు, నారాయణస్వామి, జయరాముడు, ఆదెప్ప, రాజన్న, వెంకటేశులు రామాంజనేయులు, జానార్ధన, కావేటి అశోక్, నాగేశ్వరరావు, వీరవిశ్వనాథ్, సందీప్, హరీష్, నరసింహులు, చలపతి, హరి, సుధాకర్, మంజు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : టిడిపి అధినేత చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ రావడం శుభపరిణామం అని మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఐదు కోట్ల మంది తెలుగు ప్రజలు చేస్తున్న న్యాయ పోరాటానికి న్యాయం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వం చంద్రబాబును అక్రమంగా 53 రోజులు జైలులో నిర్బంధించడం అన్యాయమన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

గెలిచింది న్యాయం కాదు రోగం..!

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ అయ్యి రిమాండ్‌లో ఉన్న చంద్రబాబు నాయుడుకు కేవలం మెడికల్ గ్రౌండ్స్ కింద కోర్టు కండిషన్ బెయిల్ ఇచ్చిందని ఇది తెలియకుండా టిడిపి నేతలు సంబరాలు చేయడం విడ్డూరంగా ఉందంటూ రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. బుధవారం నాడు అనంతపురం ఆర్‌బి అతిథిగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కండిషన్ బెయిల్‌పై విడుదల అయ్యారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నాను... బెయిల్ ఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేస్తేనే చంద్రబాబుకు మానవీయ కోణంలో చికిత్స కోసం కోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిందన్నారు. ఎంపీ గోరంట్ల మాధవ్ వాఖ్యలను టిడిపి శ్రేణులు వక్రీకరించాయన్నారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉంటేనే తాము అధికారంలో ఉంటామన్నారు. అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగాలతో ఏర్పాటైన రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున తెలుగుజాతిని నిట్టనిలువునా చీల్చిన చంద్రబాబు గురించి మాట్లాడుకోవడం దురదృష్టకరం అన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గుత్తి

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 3వ తేదీ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శివాజీరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు హాజరుకావాలని సూచించారు.

సిపిఎం బస్సు యాత్ర పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-ఆత్మకూరు

లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం 'ప్రజారక్షణభేరి' పేరుతో సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆత్మకూరులో బుధవారం 'ప్రజా రక్షభేరి' బస్సుయాత్ర పోస్టర్లను విడుదల చేశారు. శివశంకర్ మాట్లాడుతూ బస్సు యాత్ర నవంబర్ 1వ తేదీ సాయంత్రం తాడిపత్రికి చేరుకుంటుందని రైతులు, కూలీలు, పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

'ప్రజారక్షణభేరి' పోస్టర్లు విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి రామయ్య వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సోమశేఖర్ రైతు సంఘం మండల కార్యదర్శి రాము పాల్గొన్నారు.

కాళిదాసు జయంతి సభలో మాట్లాడుతున్న ఉపన్యాసకులు

ఘనంగా కాళిదాసు జయంతి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఆర్ట్స్ కళాశాల సంస్కృత విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'కాళిదాసు జయంతి'ని ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ ఆశావాది శశాంకమౌళి, సంస్కృత ఉపన్యాసకులు డా. సుధామవంశీ మాట్లాడుతూ మహాకవి కాళిదాసు సంస్కృతంలో రచించిన మేఘసందేశం, అభిజ్ఞాన శాకుంతలం చిరస్థాయిగా నిలిచిపోయే మహత్తర కావ్యాలు అన్నారు. వీరి కావ్యాల్ని ప్రేరణగా తీసుకొని ప్రపంచంలోని అనేక భాషల్లో వందల కవితలు, కావ్యాలు, కథలు, నవలలు, నాటకాలు, సినిమాలు వెలువడ్డాయన్నారు. కార్యక్రమంలో హిందీ ఉపన్యాసకులు నరసింహం, సోమశేఖర్ పాల్గొన్నారు.

చీనీ చెట్లు నరికివేత

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని గరుగు చింతలపల్లి గ్రామానికి చెందిన రైతు కె.ఓబుళయ్యకు ఎల్లనూరు మండలం పెద్దమల్లేపల్లె రెవెన్యూ గ్రామ పొలంలో 3 ఎకరాల భూమి ఉంది. అందులో 300 చీని చెట్లు ఉన్నాయి. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 9 చెట్లను నరికేశారని బాధిత రైతు ఓబుళయ్య తెలిపారు. విషయం తెలిసిన వెంటనే సిఐ సుబ్రహ్మణ్యం ఎల్లనూరు ఎస్ఐ సంపత్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రైతుని అడిగి వివరాలు తెలుసుకున్నారు. రైతు ఫిర్యాదు మేరకు వెంకటశివుడు, రామక్రిష్ణ, గోపి, రవి, పెద్దిరజులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చీనీ తోటను పరిశీలిస్తున్న ఎస్ఐ సంపత్‌కుమార్